క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడే నికి చెందిన వివిధ పార్టీల నాయకులు సుమారు 15 మంది మండల కేంద్రంలో శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఐలయ్యగౌడ్, ఇల్లంతకుంట దేవాలయ డైరెక్టర్ నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చరణ్‌పటేల్, ఎన్ఎస్‌యూఐ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాన్‌ప్రసాద్, మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, సారంగపాణి, వెంకటేష్, క్రాంతికుమార్, రాజేష్ పాల్గొన్నారు.

వైద్య సేవలందించాలి



దామెర : పేదలకు వైద్య సేవలందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన దొడు కొమురయ్య-వనమ్మ దంపతులు కుమార్తె యువాంజలి ఎంబీబీఎస్‌లో సీటు పొందిన సందర్భంగా శుక్రవారం ఆమెను సన్మానించారు. యువాంజలి నిరుపేద కుటుంబంలో పుట్టి, అనుకున్న లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమని అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని యువత చదువుపై దృష్టి సారించాలన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, రమేష్, రమణారెడ్డి, సంతోశ్, సుమంత్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

చారిత్రక అంశాలపై అధ్యయన యాత్ర

ధర్మసాగర్ : చారిత్రక అంశాల అధ్యయనం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతి, కోటప్పకొండ, చీరాల, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, విజయవాడ ప్రాంతాల సందర్శనకు వెళ్లినట్లు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలిపింది. కాకతీయ యూనివర్సిటీ చరిత్ర విభాగం ఆచార్యుడు యాదవరెడ్డి టూర్ గైడ్‌గా వ్యవహరించారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రామకృష్ణ, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ధర్మప్రకాశ్, ఉపాధ్యాయులు కవిత, సురేష్, భగవాన్ రెడ్డి, సరళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే నిలిచిన వరద



వేలేరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వరద నీరు నిలవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు లేకపోవడంతో పాటు రోడ్లపై అడుగుకో గుంత ఉండటంతో వర్షపు నీరు నిలిచి బురదమయమవుతుందని పలువురు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చే విధంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు తల్లి సక్కుబాయి, మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బక్క శివకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర తనయుడు ఇమ్మానియేల్ రాజ్ శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీలు దయాకర్, వెంకటేశ్వర్లు, ఎల్లాగౌడ్, నగేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ జయంతి



పరకాల : భారత మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్‌సింగ్ జయంతిని పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సేవకు తోవ.. ఎన్ఎస్ఎస్

- దామెరలో ముగిసిన ప్రత్యేక శిబిరం
- అనుభూతి పంచుకున్న వలంటీర్లు

దామెర : ఉన్నత చదువులు చదువుకుంటున్న నేటి యువతకు చదువు, విజ్ఞానంతో పాటు సమాజంపై బాధ్యత, సేవాగుణం పెంపొందాలనే లక్ష్యంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్)ను ఏర్పాటు చేశారు. 'సొంత లాంభం కొంతమాని పరుల కోసం పాటుపడవోయ్' అన్నట్లు నేను నాకొరకు కాదు సమాజం కోసం అనే నినాదంతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. అందులో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్య కళాశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాలకు చెందిన వంద మంది విద్యార్థిని, విద్యార్థులు చురుకుగా పాల్గొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. పారిశుద్ధ్యం, విద్యా, వైద్యంపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే శ్రమదానం చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

శ్రమదానంతో పాటు అవగాహన..

ప్రత్యేక శిబిరంలో భాగంగా విద్యార్థులు గ్రామంలోని పాఠశాల, శివాలయం, చెరువుకట్ట, గోశాల, పీహెచ్‌సీ, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రతి రోజు శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రపరిచారు. మధ్యాహ్నం నిర్వహించే అవగాహన సదస్సులో భాగంగా వ్యక్తిత్వ వికాసం, మహిళలపై జరిగే దాడులు, సామాజిక రుగ్మతలు, సీజనల్ వ్యాధులు, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై రిసోర్స్ పర్సన్స్‌తో తరగతులు నిర్వహించారు. సాయంత్రం సమాజిక రుగ్మతలపై నాటికలు, పాటలు, ఆటల ద్వారా గ్రామస్తులను చైతన్య పరిచారు. శుక్రవారం ప్రత్యేక శిబిరం ముగింపు సందర్భంగా ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు తమ అభిప్రాయాలు వెల్లడించారు. సమావేశంలో ఎస్సై కొంక అశోక్, ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి, హింగె బాబురావు, శ్రీనివాస్ రెడ్డి, పోచయ్య, మహేందర్, ప్రోగ్రాం అధికారులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



వలంటీర్లను అభినందిస్తున్న పరకాల ఏసీపీ సతీశ్ బాబు

శ్రమ విలువ తెలిసింది



ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొనటం ద్వారా శ్రమ విలువ తెలిసింది. గతంలో ఇంట్లో కూడా పనులు చేయలేదు. చదువుపైనే పూర్తి శ్రద్ధ ఉండేది. కనీసం వివిధ పనిముట్ల పేర్లు కూడా తెలిసేదికాదు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొనడం ద్వారా చాలా విషయాలు నేర్చుకున్నాను. సమాజంపై కూడా అవగాహన వచ్చింది.

- నర్మేటి నేహ, వలంటీర్

చదువుతో పాటు సామాజిక సేవ



విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా చదవుతోపాటు సామాజిక స్పృహ కలిగించేందుకు ఎన్ఎస్ఎస్ దోహద పడుతుంది. సామాజిక రుగ్మతలపై ఆటపాటలతో గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచాం. ఎన్ఎస్ఎస్‌లో పాల్గొనేందుకు విద్యార్థులు ఆసక్తి కనబర్చడం సంతోషం.

- డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి

వ్యక్తిత్వ వికాసం పెంపు



ఎన్ఎస్ఎస్‌తో చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుంది. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎన్ఎస్ఎస్ చక్కని వేదిక. 18 ఏళ్లుగా ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్నాను. నా సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఉత్తమ ప్రోగ్రాం అధికారి అవార్డుతో సత్కరించింది.

- డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రోగ్రాం అధికారి

ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి



కమలాపూర్ : శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఎల్పీఓ గంగాభవాని



ఆత్మకూరు : ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న శిక్షకులు

- డీఎల్పీఓ గంగాభవాని

కమలాపూర్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని డీఎల్పీఓ గంగాభవాని సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీఓ గుండె బాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్నికల నిర్వహణపై పీఓలు, ఏపీఓలు, ఆర్వోలు, ఏఆర్వోలకు ఎన్నికల విధులపై శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. అనంతరం శిక్షకులు ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలి, ఎన్నికల నియమావళి, సిబ్బంది విధులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ శ్రీధర్, పీఓలు, ఏపీఓలు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రానున్న సంస్థల ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. రిటర్నింగ్ అధికారులు, స్టేజ్ వన్, స్టేజ్ టు అధికారులకు నిర్వహణపై అవగాహన కల్పించారు. సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, శిక్షకులు సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, దయాకర్, వసంత రామ్, సిబ్బంది పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో ఎంపీడీఓ ఫణిచంద్ర శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులకు, ఆర్ఓ, ఏఆర్వోకు శిక్షణ ఇచ్చారు. పీఓ రవిబాబు, ఎంఈఓ భిక్షపతి, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరకాల : రానున్న స్థానిక, ప్రాదేశిక ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. ఈ మేరకు స్టేజ్-1, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు.

దామెర : మండల కేంద్రం సమీపంలోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎంపీడీఓ కల్పన ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్లు భాస్కర్ రెడ్డి, పృధ్వీరాజ్ పలు సూచనలు చేశారు. నామినేషన్, పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎంపీఓ రంగాచారి, పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పాదయాత్ర



ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్‌లో నెలకొన్న భూ సమస్యతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం పాదయాత్ర చేపట్టి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి చుక్కయ్య హాజరై వెంకటాపూర్ నుంచి ఐనవోలు వరకు చేపట్టిన పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఐనవోలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చుక్కయ్య, లింగయ్య మాట్లాడుతూ.. వెంకటాపూర్‌లో దళితులు కొనుగోలు చేసిన భూములకు పట్టాలు అందించి వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురవుతున్న వెంకటాపూర్‌లోని సర్వపురం భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ, కాల్వలు నిర్మించాలని, కోతుల బెడద నుంచి రైతులను కాపాడాలని, యాసంగి ధాన్యానికి సంబంధించిన బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాంకుమార్, నారాయణరెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, మహేందర్ పాల్గొన్నారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

పెత్తందారులు, దొరలపై, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఆమె జయంతి సందర్భంగా శాయంపేటలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కమలాపూర్‌లో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, దామెర, ఎల్కతుర్తి, ఆత్మకూరు, మండల కేంద్రాల్లో రజక సంఘం నాయకులు, పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐనవోలు మండల కేంద్రంలో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూరు : రజక సంఘం ఆధ్వర్యంలో..



శాయంపేట : ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఎల్కతుర్తిలో..



దామెరలో..



కమలాపూర్ : ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

- ప్రిన్సిపాల్ కోటేశ్

శాయంపేట : ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. శాయంపేట ప్రభుత్వ కళాశాలలో గత సంవత్సరంతో పోలిస్తే విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రభుత్వం కళాశాలకు కలరింగ్, కరెంట్ వైరింగ్, కొత్త ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కళాశాలకు ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కోటేశ్

పూలను పూజించే పండుగ బతుకమ్మ



ధర్మసాగర్ : దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీప్రియా



పరకాల : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ధర్మసాగర్ : ప్రకృతి అనుకూల జీవన విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప పండుగ బతుకమ్మ అని వ్యవసాయ శాస్త్రవేత్త, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా శాఖ వైస్ చైర్మన్ శ్రీప్రియా అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు ఇరిగేషన్ ఇంజనీర్ పవిత్రతో కలిసి హాజరై టీజీఓ రాష్ట్ర నేత, ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ రేవతి దేదీప్య అందించిన రూ.50 వేల విలువచేసే దుస్తులను కళాశాల బాలికలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచులు జరుపుకొనే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. కళాశాలను దత్తతా తీసుకుంటున్నట్లు టీజీఓ మహిళా శాఖ ప్రకటించడం అభినందనీయమని అన్నారు. ఈ కళాశాల నుంచి వృత్తి విద్యలో ప్రవేశాలు పొందినవారికి ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. అతి సాధారణ కుటుంబం నుంచి అసాధారణ స్థాయికి చేరుకున్న మహిళా అధికారులతో స్ఫూర్తి దాయక కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి మంజుల, అధ్యాపకులు అజాం, చంద్రమౌళి, బాబూరావు, సదానందం, వేణు, పాల్గొన్నారు.

పరకాల : పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళ అధ్యాపకులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలతో సందడి చేశారు.

లలితాత్రిపుర సుందరీ అలంకరణలో భద్రకాళి



ఎల్కతుర్తి : కొత్తకొండలో లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భద్రకాళి అమ్మవారు



ఆత్మకూరు : స్కందమాత అలంకరణలో అమ్మవారు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు శుక్రవారం లలితాత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని కనకదుర్గ మదనపోచమ్మ ఆలయంలో దుర్గాదేవి శుక్రవారం లలితాత్రిపుర సుందరీ అలంకరణలో భక్తులకు భక్తులకు దర్శనమిచ్చింది. బండి రాజేందర్-శరణ్య దంపతులు అన్నదానం చేపట్టగా సీఐ క్రాంతికుమార్ ప్రారంభించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

స్కందమాత అలంకరణలో దుర్గాదేవి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో వేణుగోపాల స్వామి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం దుర్గాదేవి స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అర్చకులు మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



శాయంపేటలో..



పరకాలలో..

108 కలశాలతో అభిషేకం

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. శ్రీమహాలక్ష్మీదేవి పంచలోహ విగ్రహానికి ఆలయ అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు 108 కలశాలతో పూజలు నిర్వహించారు. పంచామృతాలు, పసుపు, కుంకుమతో అభిషేకం చేసి అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనా రెడ్డి, భగవాన్ రెడ్డి, రాజేశ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగభూషణం, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మత్తడి దుంకిన చెరువులు



ఆత్మకూరు : మత్తడి పోస్తున్న కటాక్షపూర్ చెరువు



కమలాపూర్ : మత్తడి దుంకుతున్న కమలాపూర్ పెద్ద చెరువు

ఆత్మకూరు / కమలాపూర్ : ఆత్మకూరు జాతీయ రహదారిపై ఉన్న కటాక్షపూర్ చెరువు మత్తడి దుంకింది. కాగా వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. శుక్రవారం మత్తడి ప్రవాహం చూపరులను ఆకట్టుకుంది. అలాగే కమలాపూర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి పరవళ్ల అందాలు కనువిందు చేశాయి. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కమలాపూర్ పెద్ద చెరువులోకి వరదనీరు భారీగా చేరుతోంది.

రిటైర్డ్ అధికారులకు సన్మానం

ఖిలా వరంగల్: ఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ రిటైర్డ్ అధికారులకు సన్మానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.